ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 17 మే 2025 www.prajaswaramdaily.com 3

# హరీశ్ రావుతో కేటీఆర్ భేటీ..

## తాజా రాజకీయాలపై చర్చించినట్లు సమాచారం

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా, మాజీ మంత్రి, సిద్ధిపేట్ ఎమ్మెల్యే హరీశ్ రావు నివాసానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెళ్లారు. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు హరీష్ రావుతో సమావేశం అయినట్లు తెలుస్తుంది. తాజా రాజకీయలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. దీంతో పాటు హరీష్ రావు తండ్రి ఆరోగ్య పరిస్థితిని కూడా కేటీఆర్ అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తుంది. మరోవైపు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అమెరికాకు ప్రయాణమై వెళ్ళనున్నారు. తన కుమారుడు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం కోసం వెళ్తున్నారు. ఇప్పటికే యూఎస్ లో కవిత భర్త అనిల్ ఉన్నారు. ఈ నెల 23 న తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నా కవిత. ఇటువంటి సమయంలో కేటీఆర్, హరీశ్ రావు సమావేశం కావడం పార్టీ వర్గాల్లో ఉత్కంఠ రేపుతుంది.





# కాళేశ్వరంపై పీసీ ఘోష్ కమిషన్ విచారణ పూర్తి

### ఈనెల మూడో వారంలో ప్రభుత్వానికి నివేదిక

### ఇప్పటికే సిద్ధం

హైదరాబాద్ : కాళేశ్వరం కమిషన్ ఆనకట్టల సంబంధిత అంశాలపై విచారణ చేస్తున్న కమిషన్ విచారణ ప్రక్రియను పూర్తి చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన లోపాలు, వైఫల్యాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ గత ఏడాది నుంచి విచారణ చేస్తోంది. బ్యారేజీల డిజైన్, నిర్మాణం, నాణ్యత, నిర్వహణ అంశాలపై కమిషన్ విచారణ చేసింది. సాంకేతిక, ఆర్థిక, విధానపర అంశాలపై ఇంజినీర్లు, ఉన్నతాధికారులు, ఇతరులను విచారణ చేసింది. వారి నుంచి అఫిడవిట్లు తీసుకొని వాటి ఆధారంగా క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. కాగ్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికలను కూడా కమిషన్ పరిశీలించింది. అన్ని అంశాలను కమిషన్ పరిగణలోకి తీసుకొంది. రాష్ట్ర ప్రభుత్వానికి అందించాల్సిన నివేదికను జస్టిస్ ఘోష్ ఇప్పటికే సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఉన్న పెద్దలు కేసీఆర్ , హరీశ్ రావు, ఈటల రాజేందర్ ను కూడా విచారణకు పిలవాలని కమిషన్ మొదట భావించింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో వారిని విచారణకు పిలవాల్సిన అవసరం లేదన్న అభిప్రాయానికి కమిషన్ వచ్చినట్లు సమాచారం. నివేదికకు తుది మెరుగులు దిద్ది ఈ నెల మూడో వారంలో రాష్ట్ర ప్రభుత్వానికి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తన నివేదికను సమర్పించనుంది.

# సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు

### ఫ్యూచర్‌సిటీలో విద్యుత్ తీగలు, టవర్లు లేకుండా భూగర్భ వ్యవస్థ

### హైదరాబాద్‌ను డేటా సెంటర్ల హబ్‌గా మార్చే ప్రణాళిక, నిరంతర విద్యుత్ సరఫరా

### మూడేళ్లలో విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతుందని అంచనా

### ఇప్పటికే 17,162 మెగావాట్లకు చేరిన రాష్ట్ర విద్యుత్

### సీఎం రేవంత్ రెడ్డి

### భవిష్యత్ విద్యుత్ అవసరాలపై ఉన్నతస్థాయి సమీక్ష



హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెంబడి సౌర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇది పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడమే కాకుండా, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ ఉత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

రాష్ట్రంలో భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన ఫ్యూచర్‌సిటీలో విద్యుత్ సరఫరా వ్యవస్థ పూర్తిగా భూగర్భంలోనే ఉండాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్‌సిటీలో ఎలాంటి విద్యుత్ తీగలు, టవర్లు, స్తంభాలు పైకి కనిపించకుండా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భూగర్భ విద్యుత్ లైన్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన సచివాలయంలో విద్యుత్ శాఖ పనితీరు, భవిష్యత్ ప్రణాళికలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.

హైదరాబాద్ నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో డేటా సెంటర్లకు ప్రధాన కేంద్రంగా (హబ్‌గా) తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోందన్నారు. డేటా సెంటర్లకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ సరఫరా అత్యంత కీలకమని, ఈ నేపథ్యంలో విద్యుత్ లైన్ల ఆధునికీకరణ, పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఫ్యూచర్‌సిటీ నిర్మాణం ఈ లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలని, అందులో భాగంగానే భూగర్భ విద్యుత్ వ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా ప్రయోగాత్మకంగా స్మార్ట్‌పోల్స్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. మూడేళ్లలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరగనుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకు వివరించారు. ఈ ఏడాది ఇప్పటికే రాష్ట్రంలో విద్యుత్ గరిష్ఠ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరిందని, ఇది గత ఏడాది కంటే 9.8 శాతం అధికమని తెలిపారు. 2025-26 నాటికి ఇది 18,138 మెగావాట్లకు, 2034-35 నాటికి ఏకంగా 31,808 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేశారు. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచాలని, నూతన విద్యుత్ ఉత్పత్తి ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు.

# కాంగ్రెస్... కమీషన్ సర్కార్

### సురేఖ వ్యాఖ్యలపై

### రేవంత్ రెడ్డి లేదా రాహుల్ గాంధీ విచారణకు ఆదేశించగలరా..?

### నిజాలు మాట్లాడినందుకు కొండా సురేఖకు అభినందనలు - కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్ "కమీషన్ సర్కార్" నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. 30 శాతం కమిషన్ లేకుండా ఫైళ్లపై మంత్రులు సంతకాలు పెట్టరని వారి సహచర మంత్రులే చెబుతున్నారని, సచివాలయం లోపల కాంట్రాక్టర్లు ధర్నాలు చేయడం చూస్తే, ఈ వ్యవస్థలో కమిషన్ వ్యవహారం ఎంత లోతుగా ఉందో స్పష్టమవుతోందన్నారు. వరంగల్‌లో గురువారం మంత్రి కొండా సురేఖ .. కొందరు మంత్రులు డబ్బులు తీసిన తర్వాతే ఫైళ్లపై సంతకాలు పెడతారని ఆమె చెప్పిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఎక్స్ వేదికగా శుక్రవారం స్పందించారు. కొండా సురేఖ మాట్లాడిన కొన్ని నిజాలకు అభినందనలు అని తెలిపారు. మంత్రుల పేర్లను బహిర్గతం చేసి ప్రజలకు సత్యం చెప్పాలని కొండా సురేఖని కోరుతున్నానని, రేవంత్ రెడ్డి లేదా రాహుల్ గాంధీ, ఈ ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తారా? అంటూ విమర్శల వర్షం కురిపించారు. దీనిపై కొండా సురేఖ వివరణ ఇచ్చారు. తాను చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ తప్పుగా ప్రచారం చేస్తోందని, తన మాటల ఉద్దేశం గత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులపైనేనని స్పష్టం చేశారు. "పనులకు అప్పటి మంత్రులు డబ్బులు తీసుకునేవారు అన్నదే నా మాట. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ నేతలపై ఎలాంటి విమర్శలు చేయలేదు" అంటూ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారానికి తావు ఇవ్వడం సరైంది కాదని ఆమె పేర్కొన్నారు.

# 48 గంటల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతం

### కశ్మీర్‌లో భద్రతా బలగాల జాయింట్ ఆపరేషన్

### లోయలో సంయుక్త చర్యలు

### ఉగ్ర కార్యకలాపాల నేపథ్యంలో వ్యూహాలు సమీక్షించామన్న అధికారులు

### కాశ్మీర్‌లో ఉగ్రవాద వ్యవస్థను కూకటివేళ్లతో పెకిలిస్తామన్న ఐజీపీ




కశ్మీర్ : 48 గంటల్లో చేపట్టిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో ఆరుగురు ఉగ్రవాదులను మట్టుబెట్టినట్లు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సీనియర్ అధికారులు శుక్రవారం శ్రీనగర్‌లో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో వెల్లడించారు. విక్టర్ ఫోర్స్ జీఓసీ మేజర్ జనరల్ ధనంజయ జోషి, సీఆర్పీఎఫ్ ఐజీ మితేష్ జైన్ , ఐజీపీ వీకే బిర్ది కుమార్ మాట్లాడుతూ, "కాశ్మీర్ లోయలో పెరిగిన ఉగ్రవాద కార్యకలాపాల నేపథ్యంలో అన్ని భద్రతా దళాలు తమ వ్యూహాలను సమీక్షించుకున్నాయి. ఈ సమీక్ష అనంతరం ఆపరేషన్లపై మరింత దృష్టి సారించాం. ఈ సమన్వయం, పెరిగిన ఏకాగ్రతతో గత 48 గంటల్లో రెండు విజయవంతమైన ఆపరేషన్లు నిర్వహించాం. షోపియాన్‌లోని కెలార్, ట్రాల్ ప్రాంతాల్లో జరిగిన ఈ ఆపరేషన్లలో మొత్తం ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారు. కాశ్మీర్ లోయలో ఉగ్రవాద పర్యావరణ వ్యవస్థను నిర్మూలించడానికి మేము కట్టుబడ్డాం. ఈ రెండు ఆపరేషన్ల సమయంలో భద్రతా దళాలు ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించారు. "మే 12న కెలార్‌లోని ఎత్తైన ప్రాంతాల్లో ఉగ్రవాద బృందం సంచరిస్తున్నట్లు మాకు సమాచారం అందింది. మే 13 ఉదయం, కొంత కదలికను గుర్తించిన మా బృందాలు ఉగ్రవాదులను హెచ్చరించగా, వారు కాల్పులతో ప్రతిస్పందించారు. మా దళాలు వారిని మట్టుబెట్టాయి" అని వివరించారు.

"ట్రాల్ ప్రాంతంలోని ఒక గ్రామంలో రెండో ఆపరేషన్ జరిగింది. మేము గ్రామాన్ని చుట్టుముడుతుండగా, ఉగ్రవాదులు వేర్వేరు ఇళ్లలో స్థానాలు ఏర్పరచుకుని మాపై కాల్పులు జరిపారు. ఈ సమయంలో, గ్రామస్తులైన పౌరులను రక్షించడం మాకు పెద్ద సవాలుగా మారింది. ఆ తర్వాత ముగ్గురు ఉగ్రవాదులను హతమార్చాం. హతమైన ఆరుగురు ఉగ్రవాదుల్లో షాహిద్ కుట్టే అనే వ్యక్తి ఒక జర్మన్ పర్యాటకుడిపై దాడితో సహా రెండు పెద్ద దాడుల్లో పాల్గొన్నాడు. నిధుల సమీకరణ కార్యకలాపాల్లో కూడా అతడి ప్రమేయం ఉంది" అని తెలిపారు.

# భూములున్న వారికి భూ భారతి రక్ష

### ఉదయం పేరు కనిపించి మరుసటి రోజు మాయం అయ్యేది ధరణి

### అలాంటి పరిస్థితి ఇప్పుడు ఉండదు

### అప్పీల్ అథారిటీ ఏర్పాటు

### : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..



నిర్మల్ : భూములు ఉన్నవారికి రక్షణ కల్పించడమే భూ భారతి లక్ష్యం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాలుగు పైలెట్ మండలాల్లో 13 వేల అప్లికేషన్లు వచ్చాయి.. సాధ్యమైనంత వరకు సమస్యలు అన్ని పరిష్కరిస్తాం.. ధరణి వల్ల ఇబ్బంది పడ్డారో అలాంటి సమస్య భూ భారతిలో ఉండదు.. ఉదయం పేరు కనిపించి మరుసటి రోజు పేరు మాయం అయ్యేది ధరణిలో.. భూ భారతిలో అలాంటి పరిస్థితి ఉండదని తేల్చి చెప్పారు. రైతు గుండె మీద చేయి వేసుకొని పడుకోవచ్చు అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నిర్మల్ జిల్లాలోని కుంటాల సభలో ఆయనమాట్లాడారు. ఉద్దేశపూర్వకంగా ఏ అధికారి తప్పు చేస్తే అప్పీల్ కు వెళ్ళొచ్చు.. ఇప్పుడు అప్పీల్ అథారిటీ ఏర్పాటు చేస్తున్నాం.. ఏ అప్లికేషన్ ఇచ్చినా పైసా ఖర్చు లేదు.. ఎవ్వరి చుట్టూ తిరగాల్సిన పని లేదని పేర్కొన్నారు. అలాగే, జూన్ 2వ తేదీ నుంచి ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ యంత్రాగం వస్తుంది అని మంత్రి పొంగులేటి వెల్లడించారు.

అయితే, పాత 9 లక్షల 26 అప్లికేషన్ లో న్యాయమైన వాటికీ పరిష్కారం చేస్తామని తెలిపారు. ప్రతి భూమిని సర్వే చేయాల్సిన అవసరం ఉంది.. సరిహద్దులతో పాటు సర్వే మ్యాప్ లు పెట్టుతాం.. భూ భారతి చట్టంలో ఉంది.. వెయ్యి మంది సర్వేయర్లను నియమించే ప్రక్రియ కొనసాగుతుంది.. లైసెన్స్ సర్వేయర్లను 6 వేల మందిని నియమిసున్నాం.. అయితే, గత ప్రభుత్వం వీఆర్ఓలను జూన్ 2వ తేదీ నుంచి గ్రామాల్లోకి పంపిస్తాం.. భూ భారతి అమలులో తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటాం.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అందరికీ తెలిసిందే.. నాటి సీఎం అప్పులు చేసి పెట్టారు.. కానీ, మా ప్రభుత్వం డబ్బులు ఉంటే దాచుకునే దోచుకునేది కాదని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.